# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




**January 1994**

# THE WORD OF TRUTH

# ఆహ్వానము

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

## 8వ గొప్ప బైబిల్ సెమినార్

ఉపన్యాసకులు : Bro. పెర్రి బి. కాతమ్, అమెరికా

Bro. జాన్ ఫోర్డ్, అమెరికా

తేదీలు : 1994 జనవరి 17 నుండి 21 వరకు

(సోమవారం నుండి శుక్రవారం వరకు)

సమయం : ప్రతి రోజు :

ఉదయం — 10 గం॥లు

మధ్యాహ్నం — 3 గం॥లు

సాయంత్రం — 6-30 గం॥లు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో

విద్యుత్ నగర్, మెయిన్‌రోడ్

సౌజన్య ఎంటర్ ప్రైజెస్ వెనుక

ఐడియల్ కాలేజి సమీపాన

కాకినాడ - 533 003.

గమనిక : బస్సులో విశాఖపట్నంవైపు నుండి వచ్చేవారు సర్పవరంజంక్షన్ వద్ద, రాజమండ్రి వైపునుండి వచ్చేవారు ప్రతాప్‌నగర్ బ్రిడ్జి వద్ద దిగినచో విద్యుత్‌నగర్ సులభముగా చేరుకోవచ్చును.

సిటీబస్సు నెంబర్లు : 2, 3, 3A, 8, 8A, 15, 16, 22, 22,A.

---

అన్ని సంఘముల బోధకులకు యిది ఒక ప్రత్యేక ఆహ్వానము. బోధింపబడుచున్న వాక్యము లేఖనానుసారముగా ఉన్నదో లేదో పరిశోధించుటకు మీకు ఇదొక గొప్ప సదవకాశము. ఉచిత భోజన, వసతి సౌకర్యము కలదు. మీరును, మీ మిత్రులును కలిసి రండి. మీకు మా ప్రత్యేక ఆహ్వానము.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 జనవరి 1994 సంచిక 6

## సంపాదకీయము

### పాదములను కడుగుట మనం ఆచరించాలా ?

### (Should We Practice Feet Washing ?)

యేసుక్రీస్తు యోహాను 13:1-17లో బోధించిన దానిని మీరు ఆచరించుచున్నారా ? యని ఒకాయన మాకు ఉత్తరము వ్రాసారు. అక్కడ యేసుప్రభువు తన శిష్యుల పాదములు కడిగినట్లు వ్రాయబడింది. యేసుప్రభువు ఆయన శిష్యులు పస్కా విందుకొరకు కూడుకొని యుండుట మనం చూడగలము. "యేసు భోజన పంక్తిలోనుండి లేచి తన పై వస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను. అంతట పళ్ళెములో నీళ్లుపోసి శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలుపెట్టెను. ఇట్లు చేయుచు ఆయన సీమోను పేతురునొద్దకు వచ్చినప్పుడు అతడు - ప్రభువా, నీవు నా పాదములు కడుగుదువా? అని ఆయనతో అనెను. అందుకు యేసు - నేను చేయుచున్నది

ఇప్పుడు నీకు తెలియదుగాని యికమీదట తెలిసికొందువని అతనితో చెప్పగా పేతురు - నీ వెన్నడు నా పాదములు కడుగరాదని ఆయనతో అనెను. అందుకు యేసు - నేను నిన్ను కడుగని యెడల నాతో నీకు పాలు లేదనెను. సీమోను పేతురు - ప్రభువా, నా పాదములు మాత్రమే గాక నా చేతులు నా తలకూడ కడుగుమని ఆయనతో చెప్పెను. యేసు అతని చూచి - స్నానము చేసినవాడు పాదములు తప్ప మరే మియు కడుగుకొననక్కరలేదు; అతడు కేవలము పవిత్రుడయ్యెను. మీరును పవిత్రులు కాని, మీలో అందరు పవిత్రులు కారనెను. తన్ను అప్పగించు వానిని ఎరిగెను గనుక - మీలో అందరు పవిత్రులు కారని ఆయన చెప్పెను.

"వారి పాదములు కడిగి తన పై వస్త్రము వేసికొనిన తరువాత ఆయన మరల కూర్చుండి - నేను మీకు చేసిన పని మీకు తెలిసినదా? బోధకుడనియు, ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు, నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుడునైన నేను మీ పాదములు కడిగినయెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని. దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడు; పంపబడినవాడు తన్ను పంపినవానికంటె గొప్పవాడు కాదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసిన యెడల మీరు ధన్యులగుదురు" (యోహాను 13:4-17).

యోహాను 13వ అధ్యాయములో యేసు చేసిన దానిని మేము ఆచరించుచున్నామా, లేదా? యని మాకు వ్రాసిన మిత్రుడు తెలిసికొనగోరుచున్నాడు. అంటే తాను, తన అనుచరులు పాదములు కడుగుటను ఆరాధనలో ఒక భాగంగా ఎంచుకొనుచున్నారని అర్థ

మగునుచున్నది. దీనిని మనసులో యుంచుకొని అతడడిగినయెడల, పాదములు కడుగుటను ఒక ఆరాధనాచారముగా మేము చేయుట లేదని చెప్పుచున్నాము. పాదములు కడిగే ఆచారము గలవారు దానిని గొప్ప క్రియగా చాటిస్తారు. యేసుప్రభువు బోధించిన దానిని నిరర్థకము చేస్తారు. అంతేగాకుండా దీన్ని ఆచరించేవారు దానిని ప్రతి ఆదివారమున చేయరు. సరిగదా సంవత్సరానికొకసారో, లేదా ఏదో ప్రత్యేక సందర్భములోనో దాన్ని చేస్తారు. దీనిని ఒక ఆచార కర్మగా చేస్తూ అనేకులను ఆ సంఘటన చూడడానికి ఆకర్షిస్తారు. దేవుని ఘనపరచడం మాని వారు ఆయనకు అవఘనత తెస్తారు.

యోహాను 13లో యేసు ప్రభువు పాదములు కడుగుటను ఆరాధనాంశముగా బోధించుట లేదు. క్రొత్తనిబంధనలో క్రైస్తవులు ఎక్కడా పాదములు కడుగుటను ఆరాధనలో ఒక భాగంగా ఆచరించినట్లు మనం కనుగొనము. అయితే యేసుప్రభువు అణకువను, వినయాన్ని ఇక్కడ బోధించుచున్నాడు. వారి ప్రభువును, యజమానియైన ఆయన తన్ను తాను తగ్గించుకొనగలనని వారికి ఆయన బోధించాడు. ఆయనే ఆ పని చేయగల్గిన యెడల, వారుకూడ ఒండొరులకు అట్లు చేయగలరని ఆయన బోధించాడు.

యేసుప్రభువు జీవించిన ప్రదేశములో ప్రయాణము చేసి వచ్చిన వారి పాదములు కడుగుట ఒక ఆచారముగా యుండేది. మన దేశంలో కూడ గ్రామములలో పొరుగు ఊరినుండి వచ్చినవారి కాళ్లు కడుగుకొనుటకు ముందు నీళ్లిస్తారు. తమ యింటిలోనికి వారిని ఆహ్వానించడానికి చేసే అతిథి సత్కారము యిది. రోగులైనవారి పాదములు కడుగుట కూడ ఒక ఆచారంగా యుండేది. అపో. పౌలు మంచి విధవరాలిని గూర్చి ఇట్లు చెప్పాడు: "సత్ క్రియలకు పేరు పొందిన విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు ఆతిథ్యమిచ్చి, పరి

శుద్ధుల పాదములు కడిగి శ్రమపడువారికి సహాయము చేసి, ప్రతి సత్కార్యము చేయబూనుకొనినదైతే ఆమెను విధవరాండ్ర లెక్కలో చేర్చవచ్చును" (1 తిమో 5 : 10). ఆమె చేసిన అనేక సత్క్రియలలో పరిశుద్ధుల పాదములు కడుగుట ఒకటి యని గమనించుము. ఎట్టి సందర్భములో ఆమె చేసింది? రోగులైన యెడల, అంగవిహీనులైన యెడల, లేదా భౌతికంగా నిస్సహాయులైన యెడల అట్టివారి పాదములు కడుగుట సహజమే. ఇంకో మాటలో అట్టి అవుసరమున్న చోట ఆమె పరిశుద్ధుల పాదములు కడిగినది. అట్లు చేయుటకు నేడు కూడ క్రైస్తవులు అణకువకలిగి యుండాలి. అట్లు చేయని యెడల వారు యేసుక్రీస్తు మాదిరి ననుసరించుటలేదు.

గనుక మమ్మును ప్రశ్నించిన మిత్రుడు ఆరాధనలో పాదములు కడుగుటను గూర్చి అడిగినయెడల, మేము అట్లు చేయుట లేదని జవాబియ్యవలసి వచ్చుచున్నది. యేసు బోధించినరీతిగా, అంటే తన్ను తాను తగ్గించుకొని యితరులకు పరిచర్యచేయు సందర్భంగా అతడడిగిన యెడల, నిశ్చయంగా మేమట్లు చేయుచున్నాము. రోగులకు, శారీరక బలహీనులకు, బీదలకు పరిచర్య చేయుటలో క్రీస్తు సంఘస్థులు ఎప్పుడు తమ్మును తాము తగ్గించుకొనే యుందురు. పరిచర్య చేయుదురు. అయితే పాదములు కడుగుటను ఒక గొప్ప హంగామాగా సంవత్సరాని కొకసారి చేసేవారున్నారు గాని, రోగులకు అనాథులకు పరిచర్య చేయుటకు మాత్రము వారు ముందుకు రానేరారు, తమ్మును తాము తగ్గించుకొనరు.

లేఖనాల్లో బోధింపబడని ఆచారములను యితరులపై రుద్దకుండునట్లు ప్రభువు మనకు సహాయం చేయునుగాక. ప్రభువు యెదుట మనలను మనము తగ్గించుకొని ఆయనకు, మన పొరుగువారికి సేవచేస్తూ

జీవించిన యెడల, యేసు శిష్యుల పాదములు కడిగినప్పుడు ప్రదర్శించిన మనస్తత్వాన్ని మనము కూడ కలిగి యుండగలము.

---

## నరకము - నిత్యనాశన స్థలము

### (Hell, the Eternal Home of the Lost)

దేవుని వాక్యము తీర్పు దినము ఒకటి వచ్చుచున్నది యని చెప్పుచున్నది. ఆ దినమందు ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున తీర్పు తీర్చును. నీతిమంతులకు నిత్యజీవము నిచ్చి ఆయన దీవించును. అనీతిమంతులను నిత్యనరకములో శిక్షించును. నిత్య బహుమానము, నిత్యశిక్ష అను ఈ రెంటిని గూర్చి బైబిలు విపులముగా బోధించుచున్నది. ఎక్కడయితే శాసనము ఉన్నదో అక్కడ ఈ రెండును తప్పక యుండును. దేవుని శాసనము నుల్లంఘించిన వానిని ఆయన తప్పక శిక్షించును. మనము దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము. పాపమువలన వచ్చుజీతము మరణము (1 యోహాను 3 : 4, రోమా 6 : 23). ఇక్కడ చెప్పబడిన మరణము కేవలము భౌతిక మరణముకాదు. అది ఆత్మయొక్క మరణము. అనగా దేవునినుండి ఒకడు నిత్యము వేరుచేయబడు స్థితిని గూర్చి చెప్పుచున్నది. పాపులందరు నరకములో పడవేయబడుదురని నరకము యధార్థమైన ప్రదేశమని బైబిలు చెప్పుచున్నది.

నరకము అను ఈ మాట గెహెన్నా అను గ్రీకు పదమునుండి ఉద్భవించినది. ఇదే నరకాగ్ని యని కూడ మన తెలుగు బైబిలు నందు చెప్పబడి యున్నది. మరణానంతరము సంభవించు సంగతులను గూర్చి దేవుడు తన గ్రంథమందు బయలు పరచినది తప్ప మానవులెవరు ఏమియును ఎరుగరు. అందువలన నరకము లేక నరకాగ్నిని గూర్చి పరిశుద్ధాత్ముడు బైబిలునందు ఏమి లిఖించెనో మనము

తెలిసికొనుట మంచిది. యేసుక్రీస్తు అగ్నితో బాప్తిస్మమిచ్చు వాడని, ఆరని అగ్నితో పొట్టును (లేక పాపులను) కాల్చి వేయునని బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తునుగూర్చి పలికెను (మత్తయి 3 : 11, 12). ఆయన అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని అపో. పౌలు వ్రాసెను (2 థెస్స 1:7-9).

## యేసు చెప్పినది

యేసు ప్రేమాస్వరూపి, దయగల దేవుడు, కరుణగల రక్షకుడు అని మనం తలంచుచూ యుంటాము. ఆయన యెడల ఇవన్నియును నిజమే. ఆయన తన ప్రేమను ప్రకటించి నిరూపించెను. అంతే కాదు తీర్పును గూర్చి, శిక్షనుగూర్చి, నరకమునుగూర్చి మిగిలిన దైవావేశ లేఖకులందరికంటె ఆయన ఎక్కువ బోధించెను. నరకము అతి భయంకరమైన ఘోర ప్రదేశము. మనము అక్కడకు వెళ్ళకుండు నిమిత్తము ప్రభువు దానియొక్క తీవ్రతను గూర్చి మనకు తెలియజేసెను. "ఎవడైనను నాయందు నిలిచి యుండనియెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు". "మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" యని యేసు బోధించెను(యోహాను 15 : 6; మత్తయి 10 : 28). యుగ సమాప్తియందు దేవదూతలు వచ్చి నీతిమంతులలో నుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును అని మత్తయి 13:49 లో ఆయన బోధించెను. యేసుక్రీస్తు చేసిన బోధను మనము చదువుచున్న యెడల అవినీతిపరులు నరకాగ్నిని తప్పించుకొనుట దుర్లభము అని గ్రహించు

కొనగలము. వేషధారులైన శాస్త్రులను, పరిసయ్యులను చూచి ఆయన ఇట్లనెను: "సర్పములారా, సర్పసంతానమా, నరక శిక్షను మీరేలాగు తప్పించుకొందురు?.. భూమిమీద చిందింపబడిన నీతి మంతుల రక్తమంతయు మీామీాదికి వచ్చును" (మత్తయి 23:33-36).

నరకమునుగూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో మనము ఇప్పుడు గమనించుదాము:

## నిత్యనాశన స్థలము

నరకము నిత్యనాశన ప్రదేశము. ఈ జీవితాంతమున దేవునితో జీవించు నిరీక్షణను కోల్పోవు ప్రదేశము అది. ధర్మ విరోధి బయలు పరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరిచేత వానిని సంహ రించి తన ఆగమన ప్రకాశముచేత నాశనము చేయును అని 2 థెస్స 2:8లో వ్రాయబడి యున్నది. అందుకే 'ఇరుకు ద్వారమున ప్రవే శించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాల మునై యున్నది. దానిద్వారా ప్రవేశించు వారనేకులు" అని యేసు బోధించెను (మత్తయి 7:13).

## ప్రతిదండన జరుగు స్థలము

నరకము ప్రతిదండన చేయబడు ప్రదేశము: "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, యేసు సువా ర్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయును అని వ్రాయబడి యున్నది. ప్రతిదండన అనగా న్యాయమును తీర్చుట, పగతీర్చుట యను వాటిని సూచించుచున్నది. అందుకే "దేవుని కుమారుని పాద ములతో త్రొక్కి, తాను పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రముగా నెంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్క

రించినవాడు ఎక్కువైన దండనకు పాత్రుడని" హెబ్రీ 10 : 29లో వ్రాయబడి యున్నది.

## నిత్య యాతన స్థలము

నరకము దుర్మార్గులు నిత్యము యాతన, బాధపడు ప్రదేశమై యున్నది. యేసు ఒక ధనవంతుని గూర్చి బీదవాడైన లాజరును గూర్చి చెప్పిన సంఘటన లూకా 16వ అధ్యాయములో వ్రాయబడి యున్నది. ధనవంతుడు చనిపోయి పాతాళములో బాధపడుచు...నేను ఈ అగ్ని జ్వాలలలో యాతన పడుచున్నానని కేకలువేసి చెప్పెను (లూకా 16:23, 24). నరకములో మానవులు పడు యాతన నిజమైనది. అది అంతులేనిది. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 8:12).

నరకము దేవుని ఉగ్రత కుమ్మరింపబడు ప్రదేశమై యున్నది. దేవుడు ప్రేమమయై యున్నాడని చెప్పు బైబిలు గ్రంథమే ఆయన దహించు అగ్నియై యున్నాడని చెప్పుచున్నది (హెబ్రీ 12 : 29). అందువలన జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము (హెబ్రీ 10:31). భేదములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును...దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, శ్రమయు వేదనయు కలుగును (రోమా 1 : 8,9). దేవుని ఉగ్రతకు తాళజాలిన వాడెవడును లేడని ప్రకటన 6:15-17లో వ్రాయబడి యున్నది.

## అగ్ని గుండము

నరకము నిత్యము అగ్నితో మండుచుండు ప్రదేశమైయున్నది. అది అగ్నిగుండమని మత్తయి 13:42, ప్రకటన 20:15లలో వ్రాయబడి యున్నది. "మనుష్యకుమారుడు తన దూతలను పంపును; వారా

యున రాజ్యములో నుండి ఆటంకములను సకలమైన వాటిని, దుర్నీతి పరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురని" యేసు బోధించెను. అది ఆరని అగ్నియని, అగ్ని గంధకముతో మండు గుండమని మత్తయి 9:44, 45 లోను, ప్రకటన 20:10 లోను వ్రాయ బడి యున్నది. దాని నుండి పొగ యుగయుగములు లేచునని ప్రకటన 14:11 లో వ్రాయబడి యున్నది.

నరకము కటిక చీకటియైన ప్రదేశము. చీకటిని మానవులు సహజముగా ద్వేషించుదురు. దానిని గూర్చి సహజముగా భయపడు దురు. అయితే నరకములో పడవేయబడువారు వెలుపలి చీకటిలో పడవేయబడుదురు (మత్తయి 25:30). అవినీతిపరులకు, దుర్మార్గులకు గాఢాంధకారము నిరంతము భద్రముచేయబడి యున్నదని యూదా: 13లో వ్రాయబడి యున్నది. పాపము చేసిన దేవదూతలను దేవుడు పాతాళలోక మందలి కటిక చీకటిగల బిలములలోనికి త్రోసి తీర్పుకు కావలిలో యుంచెనని 2 పేతురు 2:4 లో వ్రాయబడి యున్నది. నర కము గాఢాంధకార ప్రదేశమనగా దేవుడు బొత్తిగా లేని ప్రదేశము అది. దేవుడు వెలుగై యున్నాడు (యాకోబు 1 : 17; 1 యోహాను 1:5). గనుక దేవునినుండి బొత్తిగా వేరుచేయబడుట కటిక చీకటిలో యుండుటయే.

## నరకము ఎవరి కొరకు

నరకమనగా దేవుడిచ్చు నిత్యశిక్ష అనుభవించే ప్రదేశము, దేవుని ఉగ్రత ననుభవించే ప్రదేశము. నిరంతరము యాతనపడే ప్రదే శము. అది రెండవ మరణము (ప్రకటన 20:15).

నరకము ఎవరికొరకు సిద్ధము చేయబడినది? అనే ప్రశ్న మనకు రావచ్చును. ప్రకటన 21:8 లో ఇట్లు వ్రాయబడినది: "పిరికివారును,

అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులను, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరును అగ్ని గంధ కములతో మండు గుండములో పాలు పొందుదురు. ఇది రెండవ మర ణము". వారికేగాక యేసు సువార్తకు లోబడని వారికి నరకము తథ్య మని బైబిలు బోధించుచున్నది (2 థెస్స 1 : 7-9, రోమా 2:8-9). సువార్తకు లోబడుట యనగా క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరు త్థానములకు లోబడుట (1 కొరింధి 15:3, 4). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటయే క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానములకు లోబ డుట. ఇంకొక మాటలో నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినయెడల సువార్తకు లోబడినవాడ వగుదువు.

క్రీస్తులో ఉండియు కూడ ఫలములు ఫలింపని వారికి, అనగా నిష్ఫలులైన క్రైస్తవులకు నరకము సిద్ధము చేయుబడి యున్నది. ఎవ డైనను నాయందు నిలిచి యుండనియెడల వాడు తీగవలె బయట పార వేయబడి యెండిపోవును: మనుష్యులు అట్టివాటిని పోగుజేసి అగ్నిలో పార వేతురు. అవి కాలిపోవును, నాలో ఫలింపని ప్రతి తీగెయు తీసి పారవేయబడునని యోహాను 15వ అధ్యాయములో యేసు బోధించెను.

అపవాదికిని, వాని దూతలకును, దేవునిపై తిరుగుబాటు చేసిన దూతలకును నరకము సిద్ధపరచబడి యున్నదని మత్తయి 25 : 41, 2 పేతురు 2:4 లో వ్రాయబడి యున్నది.

తీర్పు దినమందు గ్రంథములు విప్పబడును. ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్న నాటినిబట్టి మన క్రియల చొప్పున యేసు ప్రభువు మనకు తీర్పు తీర్చును. మరియు ఎవని పేరైనను జీవగ్రంథ మందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో

పడవేయబడును (ప్రకటన 20 : 12-15). నీ పేరు జీవగ్రంథమందున్నదా? నీవు క్రీస్తులోను ఆయన సంఘములోను ఉన్న యెడల నీ పేరు ఆ గ్రంథమందు కనబడును. లేనియెడల యేసునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, క్రీస్తును ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన ఇప్పుడు పరిశుద్ధాత్మ యను వరమును, తదనంతరము నిత్యజీవ కిరీటమును నీకు బహూకరించును.

—జాషువా గూటం.

—o—

## సింహాసనాసీనుడై యున్న దేవుడు

## ( God on His Throne )

మూలము : ప్రకటన గ్రంథము

వందలాది సంవత్సరముల క్రితము షేబ దేశపు రాణి సొలొమోనును దర్శించుటకు వచ్చెను. అతని ధనసంపదలు గొప్పవి. అతని జ్ఞానము మితిలేనిది, అతని శక్తి మరింత గొప్పది. దీనినంతటినీ తన కన్నులారా ఆమె చూడగోరింది. ఆమె దేనిని విడువక సమస్తాన్ని చూచింది. సొలొమోను యొక్క సింహాసనాన్ని చూచేసరికి ఆమె ఎంత దిగ్భ్రాంతి చెందినదో మనం గమనించుకోవచ్చును. అటువంటిది మరి ఏ రాజ్యమందైనను చేయబడ లేదు. ఆ సింహాసనము దంతము చేత చేయబడి బంగారముతో పొదగబడెను. ఆ సింహాసనమునకు ఆరు మెట్లుండెను. సింహాసనము మీది భాగవు వెనుకతట్టు గుండ్రముగా ఉండెను; ఆసనమునకు ఇరుపార్శ్వములయందు ఊతలుండెను. ఊతల దగ్గర రెండు సింహములు నిలిచియుండెను. ఇరుప్రక్కల ఆరు మెట్ల మీద పండ్రెండు సింహములు నిలిచియుండెను (1 రాజులు 10:18-20). ఆ సింహాసనము మీద రాజైన సొలొమోను ఆసీనుడై యుండెను.

మహాజ్ఞాని, వాస్తు శాస్త్రజ్ఞుడు, నిర్మాణికుడు, సంగీతకారుడు, వృక్ష శాస్త్రవేత్త, వర్తకుడు, జంతుశాస్త్రజ్ఞుడు, రాజకీయ దురంధురుడు, రాజు!! తాను వినిన దానికంటె కనుగొనినది ఎంతో విస్తారమైనదని షేబారాణి గ్రహించి విస్మయమొందినది (1 రాజులు 10:8).

మనల్ని ఆశ్చర్యచకితులను చేసి ఊపిరాడకుండా చేసే కొన్ని సంగతులు కలవు. దేవుడు తన సింహాసనాసీనుడై యుండగా పరలోక దృశ్యము అలాంటిదే. వర్ణింపనలవికాని అందము, అత్యున్నతమైన మహిమా ప్రభావము, భయంకరమైన తీర్పునిచ్చే సింహాసనము సర్వశక్తిగల దేవుని సింహాసనము. ఆయన ఒక్కడు మాత్రమే పరిశుద్ధుడు. గనుక సర్వజనాంగములు ఆయనను ఆరాధింతురు.

సింహాసనాసీనుడై యున్న దేవుని ప్రాముఖ్యతను ప్రకటన గ్రంథము వివరించుచున్నది. పత్మాసు ద్వీపములో అపొస్తలుడైన యోహాను పరలోకములో ఒక ద్వారము తెరువబడి యుండుట చూచాడు. "వెంటనే నేను ఆత్మవశుడనైతిని. అదిగో పరలోకమందు ఒక సింహాసనము వేయబడి యుండెను. ఆ సింహాసనమునందు ఒకడు ఆసీనుడై యుండెను" (ప్రకటన 4:2). పరలోకమందు ఒక సింహాసనమున్నది! 4, 5 అధ్యాయములలో దాన్ని గూర్చి 17 సార్లు చెప్పబడినది. ఆ సింహాసనము ఖాళీగా యేమీ లేదు! దానిమీద ఒకాయన కూర్చొని యున్నాడు, ఆయనే పాలించువాడు. సర్వశక్తిగల ప్రభువైన దేవుడు!

సింహాసనాసీనుడై యున్న దేవుని గూర్చి మనం చెప్పుకొనేటప్పుడు, ప్రకటన గ్రంథములోని భాష అత్యంత అలంకార భాష యని మీరు గుర్తు చేయాలి. ప్రకటన గ్రంథమును చదువునప్పుడు అది మన కళ్ళయెదుటనే ఆవిష్కరింపబడుచున్న యొక గొప్ప దృశ్య

మని గుర్తుంచుకోవాలి. ప్రకటన గ్రంథము మనకు కనిపించేలాగున వర్ణింపబడింది. "నాతో మాటలాడుచున్న స్వర మేమిటో యని చూడ తిరిగితిని" (ప్రక 1:12).

## మనోహర సింహాసనము

దేవుని సింహాసనము మనోహర సింహాసనము. మరకతమువలె ప్రకాశించు ఇంద్రధనస్సు సింహాసనమును ఆవరించి యుండెను. ఆ సింహాసనమునుండి మెరుపులును, ధ్వనులును, ఉరుములును బయలు దేరుచుండెను. మరియు ఆ సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచుండెను. అవి దేవుని యేడు ఆత్మలు. సింహాసనము చుట్టు ఇరువది నాలుగు సింహాసనము లుండెను. ఈ సింహాసనములందు ఇరువది నలుగురు పెద్దలు తెల్లని వస్త్రములు ధరించుకొని, సువర్ణ కిరీటములు ధరించుకొని యుండిరి. సృజింపబడిన అన్ని జీవరాసుల ప్రతినిధులుగా నాలుగు జీవులకూడ యుండెను. ఆ నాలుగు జీవులలో ప్రతివానికి ఆరేసి రెక్కలుండెను. అవి - భూత వర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు దేవుడు నగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబగళ్ళు చెప్పుచుండెను.

ఆ సింహాసనము మధ్యను వధింపబడినట్లుండిన గొర్రెపిల్ల నిలిచియుండెను. ఆ గొర్రెపిల్లకు ఏడు కొమ్ములును, ఏడు కన్నులుండెను. ఆ కన్నులు భూమియందంతటికి పంపబడిన దేవుని యేడు ఆత్మలు. ఆ నాలుగు జీవులును ఇరువది నలుగురు పెద్దలును ఆ గొర్రెపిల్ల యెదుట సాగిలపడిరి. వారు తీగలను, ధూపద్రవ్యములతో నిండియున్న సువర్ణ పాత్రలను పట్టుకొని యుండిరి. ఈ పాత్రలు పరిశుద్ధుల ప్రార్థనలు. వారు పాడుటకు మొదలిడిరి.

మనకు అనేక దూతల స్వరము వినబడును. వారి లెక్క కోట్ల

కొలది యుండెను. వారు గొర్రెపిల్లకు స్తోత్రములు చెప్పుచున్నారు. మరియు ఆ సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్రమున్నట్లుండెను. మనం ఎటు చూచినా, అందము, మనోహరము, సౌందర్యము, మహిమయే కనబడును (ప్రక 4-5 అధ్యా).

## శక్తిగల సింహాసనము

దేవుడు సింహాసనాసీనుడై యున్నాడు. ఆయన తన విశ్వాన్ని యేలుచున్నాడు. ఈ భూలోక శక్తులు ఎంత భయంకరంగా, క్రూరంగా కనబడినా, అవి ఆయన యెదుట నిలువనేరవు. ఈలోకం దానికదే విడిచిపెట్టబడలేదు. దానినేదో ఒక అగోచర శక్తి పాలించుట లేదు. ఎవరోఒకరు దీనిని కంట్రోలులో ఉంచుకొని యున్నారు. ఆయన కైసరు కాదు, అమెరికా అధ్యక్షుడు కాదు. యే మానవమాత్రుడు కాదు. డొమేషియన్ చక్రవర్తి తాను "ప్రభువును దేవుడనని" పిలిపించుకొన్నాడు గాని నిజానికి ఆ బిరుదు వేరొకనిది. ఈలోక రాజులు తమ రాజదండములను నీకో చక్రవర్తికి సమర్పించవచ్చునేమోగాని, సర్వశక్తిగల దేవుని యెదుట సమర్పింపబడే సువర్ణ కిరీటముల యెదుట అవి యెందుకు పనికిరావు. దేవుడు సమస్తాన్ని తన అదుపులో ఉంచుకొనియున్నాడు. పరలోక సింహాసనాసీనుని యెదుట భూరాజుల సార్వభౌమత్వము అర్థరహితమైనదే. అత్యంత ఘనంగా ఆయన ఒక్కడుమాత్రమే పాలించుచున్నాడు. ఆయన మాట్లాడగా జనములు లేచును. ఆయన మాట్లాడగా జనాంగములు కూలద్రోయబడును. అవి కుమ్మరి చేతిలోనున్న మన్నువంటివే (యిర్మీయా 18:1-10). కానాను దేశ రాజులను ఓడించుటకు, బబులోనును కూలద్రోయుటకు, రోమా చక్రవర్తిని మట్టికరిపించుటకు దేవునికి శక్తి యున్నది. "యెహోవా, భూమ్యాకాశముల యందుండు సమస్తమును నీ వశము; మహాత్మ్యమును పరాక్రమమును, ప్రభావమును, తేజస్సును ఘనతయు నీకే

చెందుచున్నవి; యెహోవా రాజ్యము నీది, నీవు అందరిమీదను నిన్ను అధిపతిగా హెచ్చించుకొని యున్నావు" (1 దినవృ 29:11).

సర్వశక్తి దేవునికి కలదు. ఆయనకు సమస్తమును సాధ్యమే. మిగిలిన అన్ని శక్తులను ఆయనే సృజించెను. ప్రకృతి శక్తులు, ప్రధానులు, అధికారులు, గోచరమవునవేమి, అగోచరమవునవేమి అన్నియు ఆయన సార్వభౌమత్వానికి తలవొగ్గవలసినదే.

హింసల మధ్య క్రైస్తవులు సింహాసనాసీనుడై యున్న తమ దేవుని బట్టి ధైర్యము పొందుదురు. రోమా సైన్యములు అతి ఘోరముగా హింసింపవచ్చును. అజేయులుగా వారు కనబడవచ్చును గాని క్రైస్తవులు దేవుని తట్టు తిరిగి రాజ్యమును, పరాక్రమమును, ప్రభావును, తేజస్సును, నిరంతరము నీకే చెందునని చెప్పగలరు.

## న్యాయము తీర్పుల సింహాసనము

దేవుని యేలుబడిలో న్యాయము, తీర్పు యిమిడి యున్నవి. "సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు న్యాయము చేయడా?" (ఆది 18:25). సొదొమ గొమొర్రాలను గూర్చి బ్రతిమలాడుచు అబ్రాహాము అడిగిన ఆ ప్రశ్నకు ప్రకటన గ్రంథములో జవాబు దొరుకుచున్నది.

దుష్టత్వానికి శిక్ష విధించబడాలి. దేవుని చేతిలో ఒక గ్రంథపు చుట్ట యున్నది. గొర్రెపిల్ల ఆ గ్రంథపు ముద్రలు విప్పినప్పుడు, నాలుగు గుర్రములపై ఆసీనులై యున్నవారు స్వారీచేయాలి. ఓటమి, కరువు, మరణము సంభవించుచుండగా మనం ఆశ్చర్య చకితులమై దీనినంతా తిలకిస్తాము. ఏడు బూరలు ఊదబడును. అప్పుడు అగ్ని వడగండ్లు కురియును. చివరకు సూర్యుడు, నక్షత్రములు కూడ కంపించును. పరలోకములో యుద్ధము జరిగినందున దుష్టత్వము బయలుపర్చబడెను. మరియు ఆ గొప్ప క్రూరమృగము పడద్రోయబడెను.

మరియు సముద్రమునుండి యొక మృగము దానికి నిశ్చయంగా సంభ వించు అంతముకొరకు లేచును. మరియు ఏడు పాత్రలు చేతపట్టుకొని యున్న ఏడు దూతలు కనబడుదురు. ఆ యేడు పాత్రలు దేవుని కోపముతో నిండియున్న ఏడు తెగుళ్ళు. అవి భూమిమీద కుమ్మరించ బడును. క్రూరమృగముపై యున్న వేశ్య నాశనమునకు పోవును. మహాబబులోను నాశనమయ్యెను. మరియు అగ్నిగంధకములతో మండు గుండములో అబద్ధ ప్రవక్తయు, క్రూరమృగమును పడద్రోయ బడును. సాతానుడు బంధింపబడి అగాధములో పడద్రోయబడును. గోగు, మాగోగులు ఓడిపోయిరి. అందరును ఆ గొప్ప ధవళ సింహా సనము యెదుట నిలువగా అందరికీ తీర్పువచ్చును. "వారిలో ప్రతి వాడు తన క్రియలచొప్పున తీర్పు పొందెను" (ప్రక 20:13).

"యెహోవా రాజ్యము చేయుచున్నాడు. భూలోకము ఆనందిం చునుగాక...నీతి న్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారము" (కీర్తన 97:1,2). దుష్టులు శిక్షింపబడుదురు, నీతిమంతులు ప్రతిఫలము పొందుదురు. ఆలోచన, విచక్షణ గలిగిన వ్యక్తికియిది ఎంత మధురమో! ఈ లోకంలో మన చుట్టూ అక్రమము, బలత్కారము, హింస, దుఃఖము చూస్తూనే ఉన్నాము. దుష్టులు అభివృద్ధిజెందుట, నీతిమంతులు హింసలు పొందుట విధిగా జరుగుట మనమెరుగుదుము. "నాధా, సత్య స్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని" బిగ్గరగా కేకలువేయుట జరుగును (ప్రక 6:10). అయితే ఎల్లప్పుడు అట్లుండదు ఏలయనగా దేవుడు తన సింహాసనము మీాద కూర్చొని యున్నాడు.

## కృపా సింహాసనము

దేవుని సింహాసనము కృపాసింహాసనము. విమోచింపబడిన వారందరు తెల్లని వస్త్రములు దరించుకొని యుండుట చూడు, దేవుని

కృపయొక్క నిదర్శనమును తప్పక చూడగలవు. కృపవలన ఆయన నూతన ఆకాశమును నూతన భూమిని కలుగజేయును. "ఇదిగో సమస్తమును నూతనముగా జేయుచున్నాను". అది నూతనమైనదైనందున నీవు సంతోషించవా? పాపమునకు స్వాగతము పలుకని ప్రదేశమొకటి యున్నదని నీవు సంతోషించవా? అక్కడ మానవుని క్రూరత్వముగాక దేవుని మంచితనమే ప్రత్యక్షమగును.

అక్కడ సహవాసము ఎంత పరిపూర్ణమైనదో గదా! దేవుని కృప వలన అక్కడ భద్రత గలదు. అ పట్టణము చుట్టు ప్రహరిగోడ యున్నది. దానిలో రాత్రి లేదు. చీకటి లేదు. ఏలయనగా దేవుడే దానికి వెలుగై యున్నాడు.

పరలోకము చచ్చవుక (four square) మైనది. అది దాని పరిపూర్ణతకు చిహ్నము. అది సౌందర్యముతోను, తేజస్సుతోను నిండిన పట్టణము. ఈ దృశ్యాన్ని వర్ణించదగిన భాష లేదు. బంగారు వీధులు, ముత్యములతో పొదగబడిన గుమ్మములు, వెలగల రాళ్లు, ఇవన్నీ ఊహించుకో. ఎంత అందమైన పట్టణమో!

ప్రతి అవుసరము అక్కడ తీర్చబడును. స్ఫటికమువలె మెరయునట్టి జీవజలముల నది దేవుని సింహాసనమునుండి ప్రవహించును. నెల నెలకు పండ్రెండు కాపులు కాయు జీవ వృక్షము అక్కడున్నది. దాని ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించబడును. అక్కడ ఆకలి దప్పు లుండవు. దేవుడే వారి కన్నుల ప్రతి భాష్పబిందువును తుడిచివేయును (ప్రక 22 : 1, 2; 7 : 17). ఈ దేవుని కృపను మనం గానము చేయు బద్ధులము!

## ఆరాధన సింహాసనము

ఆయన దాసులు ఆయనను సేవింతురు (ప్రక 22:3). పరలోకారాధన భయభక్తులతో కూడినది. "దేవదూత లందరును సింహాసనము

చుట్టును పెద్దల చుట్టును ఆ నాలుగు జీవుల చుట్టును నిలువబడి యుండిరి. వారు సింహాసనము ఎదుట సాష్టాంగపడి - ఆమేన్; యుగ యుగముల వరకు మా దేవునికి స్తోత్రమును, మహిమయు, జ్ఞానమును, కృతజ్ఞతాస్తుతియు, ఘనతయు, శక్తియు, బలమును కలుగునుగాకయని చెప్పుచు దేవునికి నమస్కారము (ఆరాధన) చేసిరి" (ప్రకటన 7 : 11, 12).

పరలోకారాధన స్తోత్రములో నిండియుండునట్టిది. "వారు - ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి, యుగయుగములకు రాజా, నీ మార్గములు న్యాయములును సత్యములునై యున్నవి; ప్రభువా నీవు మాత్రము పవిత్రుడవు. నీకు భయపడని వాడెవడు? నీ నామమును మహిమపరచని వాడెవడు? నీ న్యాయ విధులు ప్రత్యక్షపరచబడినవి గనుక జనములందరు వచ్చి నీ సన్నిధిని నమస్కారము (ఆరాధన) చేసెదరని చెప్పుచు దేవుని దాసుడగు మోషే కీర్తనయు, గొర్రెపిల్ల కీర్తనయు పాడుదురు" (ప్రక 15:3-4).

పరలోకారాధన హృదయ పూర్వకమైనది. కూడివచ్చిన జన సమూహములో గొప్ప సంతోషానందములు ఉప్పొంగును. గొప్ప జనసమూహము "ప్రభువుని స్తుతించుడి. రక్షణ మహిమప్రభావములు మన దేవునికే చెందును" అని చెప్పుదురు (ప్రక 19:1).

పరలోకారాధన ఎడతెగనిది. "అందువలన వారు దేవుని సింహాసనము ఎదుట ఉండి రాత్రింబగళ్ళు ఆయన ఆలయములో ఆయనను సేవించుచున్నారు" (ప్రక 7:15). కాలమానమును బట్టి వారి ఆరాధన యుండదు గాని ఎడతెగని వారి హృదయ తత్వమును బట్టి యుండును.

ఆరాధనను ఏ మానవుడు కించపరచరాదు. మానవుడు దేవుని పవిత్రత కొరకు ఆయనను సమీపించవలసినదే. మనము దేవుని దగ్గరకు

తిరిగిరావాలి లేదా అంతరంగమరణాన్ని అంగీకరించాలి! ఆరాధన లేకుండా ప్రజలు జీవించలేరు. వారు మరణిస్తారు! వారు తమకంటె ఉన్నతుని ఆరాధించుటకు మానినప్పుడు తమకంటె అధోగతికి పాలవుదురు.

## ముగింపు

దేవుని సింహాసనము యేమి సింహాసనమో! అది మహిమ మనోహరము శక్తిగల సింహాసనము. అది న్యాయము తీర్పుల సింహాసనము. అది కృపారాధనల సింహాసనము. అది దేవుని సింహాసనము! మనమాయనను అక్కడ చూడగలిగితే మన విజయాన్ని కండ్లారా చూడగలము.

మహిమగల ఆ రాజును ఒకానొక దినమందు మనము చూతుము. ఒకానొక దినమందు ఆయన సింహాసనము చుట్టు యుండి ఆరాధింతుము. ఒకానొక దినమందు మనం "యుగయుగములు రాజ్యము చేతుము" (ప్రక 22:5). అది ఎంత ధన్యకరమైన దినమో! ఆ దినము వరకు మన విశ్వాసము, విధేయత, ఆరాధనలు ఎడ తెగరాదు!!

—జాన్ డి. గిబ్సన్.

—o—

## ఆది దంపతుల గర్భఫలము

దేవుని పోలిక ద్వారా నిర్మితులైన ఆదాము హవ్వలు గర్భఫల సంబంధులు కారు గాని, అద్భుతముగా సృష్టింపబడిన భార్యాభర్తలై యున్నారు. ఇక ఒకని రక్తము వలన సమస్త జాతి మనుష్యులు ధరణిలో విస్తరించుట దైవ సంకల్పము (ఆ. కా. 1 : 28; అపొ. కా. 17:26-27). ఆదాము హవ్వను కూడినపుడు ఆమె గర్భవతియై ఇద్దరు పుత్రులను కనెను. జ్యేష్టుడు కయీను తమ్ముడు హేబెలు. కుమారులు యెహోవా అనుగ్రహించిన స్వాస్థ్యమును, గర్భఫలము దేవుడిచ్చిన

బహుమానము (కీర్తన 127 : 3, 4). ఈ దంపతులు దేవుని దయచే వీరిని సంపాదించుకొనగల్గిరి (ఆది. కా. 4:1).

## కొలువు + క్రియలు

కయీను భూమిని సేద్యపరచువాడును తమ్ముడు గొర్రెల కాపరియై యుండిరి. లేఖనమున వీరి గుణ స్వభావాధికములను పరిశీలించిన ఒకరికొకరు వైరులుగా భక్తి, భక్తిహీనతతో మంచి చెడు క్రియలు, విశ్వాసి అవిశ్వాసిగా సూచింపబడిరి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? అను వాస్తవములను కలిగియుండిరి (II కొరింథి 6 : 14-18).

కొంత కాలానికి హేబెలు తన మందనుండి తొలిసంతతిని కయీను భూఫలమును దేవునికి అర్పణలు తెచ్చిరి. దేవుడు నీతిమంతుడైన తమ్ముని అర్పణను స్వీకరించి జ్యేష్ఠుడైన కయీను అర్పణను తిరస్కరించుట వలన మిక్కిలి కోపముతో ముఖము చిన్నబుచ్చుకొని తల పైకి ఎత్తకుండెను (ఆది. కా. 4 : 3-7). అంతర్యము గుర్తించిన దైవత్వం హేబెలుయొక్క శ్రేష్టమైన బలినిగూర్చి, విశ్వాసమును బట్టి అర్పించెనని సాక్ష్యమిచ్చెను (హెబ్రీ 11:4-7, యోహాను 2:24).

## మొదటి నరహత్య

అటు తరువాత వారిద్దరు పొలములో ఉన్నపుడు అన్న తమ్మునితో ఏమో ఎంతసేపు మాట్లాడెనో ఎరుగము. అయితే శరీర కార్యములు స్పష్టమై యున్నవి. ద్వేషము, పగ, కలహము (గలతి 5:19). ఈర్ష్య పాతాళమంత కఠోరమైనదని చెప్పబడెను (పరమగీతములు 8:6). శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకు ఘోరంగా పోరాడినట్లు ఉంది (గలతీ 5 : 17). ఆ సంభాషణ తుదకు కయీను మహా క్రోధుడై హేబెలుపై పడి అతనిని చంపి చరిత్రలో మొదటి నరహంతకుడాయెను.

## రక్తపు స్వరము

అసువులు బాసిన వాని రక్తముయొక్క స్వరము నేలనుండి సృష్టికర్తకు మొఱ్ఱపెట్టి, విశ్వాసముద్వారా మాట్లాడెను (ఆది. కా. 4:10; హెబ్రీ 11 : 4). రక్తములో ప్రాణమున్నదని యెరుగుదుము (ఆది.కా. 9:4). కాని హేబేలు యొక్క రక్తము ఎలా సంభాషించెనో అగోచరము. భూమీ నా రక్తము కప్పివేయకుము నా మొఱకు విరామమతి కలుగకుండునుగాకని యోబు చెప్పెను (యోబు 16:18).

## హంతకునితో దేవుడు

ఇతని తల్లిదండ్రులు పాపము చేసినపుడు దేవునికి భయపడి దాగుకొని సమాధానమిచ్చిరి. అయితే ఈ హంతకుడు హేబేలును నేనరుగను, అతనికి నేను కాపరివాడనా? అని ప్రత్యుత్తరమిచ్చెను. దేవుడతనిని శపించెను (ఆది.కా. 4 : 9-15). కయీను నడచిన మార్గమున నడువకూడదు (యూదా 1 : 11). తన సోదరుని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవనియు, హేబేలు క్రియలు నీతిగలవియునై యుండుట చేతనే గదా! మనము కయీను వంటివారమై యుండరాదు (1 యోహాను 3:12). నీటిని జరిగించు ప్రతివారును, తన సోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు. (1 యోహాను 3 : 10). విశ్వాసవీరుడైన హేబేలుకంటె మరి శ్రేష్ఠముగ పలుకు ప్రోక్షణ రక్తమునకు వచ్చిన క్రైస్తవులు (హెబ్రీ 12 : 24) ఒకరినొకరు ప్రేమిస్తూ సత్యవాక్యములను గైకొనెదరు.

— జి. చంద్రకళ, మద్రాసు - 600039.

---

## ఆదాము భార్య జీవముగల ప్రతివానికి తల్లి

మొదట నేలనుండి పుట్టిన వాని నాసికారంధ్రములలో దేవుడు

జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది. కా. 2 : 7). అందుకే ఆదాము జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడెను (1 కొరింథి 15 : 45). నరుని ప్రక్కటెముకను తీసి స్త్రీని సృజించెను (ఆది. కా. 3 : 22). పురుషుని నుండి స్త్రీ కలిగెనే గాని స్త్రీ నుండి పురుషుడు కలుగలేదు (1 కొరింథి 11:8). మొదట ఆదామును తర్వాత హవ్వయు నిర్మింపబడిరి. (1 తిమోతి 2:13). స్త్రీ పురుషుని కొరకే సృజింపబడిరి ఆదామునకు జతపరచబడెను (1 కొరింథి 11:9, మత్త 19:6). సాటియైన సహాయము లేని ఆదామునకు భార్య దొరికినందున మేలు దొరికెను (సామెతలు 18:22). భర్త తన భార్యకు హవ్వయని పేరు పెట్టెను. అంటే జీవముగల ప్రతివానికి తల్లి అని భావం (ఆది. కా. 3 : 22). స్త్రీ పురుషుని మహిమయై యున్నది (1 కొరింథి 11 : 7). స్త్రీ పురుషుని నుండి ఎలాగు కల్గెనో అలాగే పురుషుడు స్త్రీనుండి కల్గెను (1 కొరింథి 11:12). క్రీస్తు ఒక్కడే వాగ్దానమును బట్టి స్త్రీ సంతానమై యున్నాడు (ఆది. కా. 3:15 గలతీ 4:4-6).

వీరు ఏదెనులో చల్లపూటన దేవుని సహవాసాన్ని కల్గి పరిశుద్ధులుగా, నిర్దోషులుగా వుండిరి. దేవుడు జతపర్చిన వారిని ఎవరు విడదీయకూడదు (మత్తయి 19:5). హవ్వ తల్లిని సృజించకముందే ఆజ్ఞ ఉన్నను ఇద్దరిని అది వర్తించును (ఆది. కా. 2:16-17). దేవుడే స్త్రీ బలహీనమైన ఘటమని చెప్పెను (1 పేతురు 3:7). అందుచే అపవాది హవ్వతో ఆ ఫలములు తింటే చావనే చావరని (ఆది. కా. 3:4-5) తన కుయుక్తిచే ఆమె మనస్సు చెరిపి మోసపర్చి అపరాధములో పడవేసెను (II కొరింథి 11 : 2). ఆదాము మోసపర్చబడలేదు గాని హవ్వ మోసపోయెను (1 తిమోతి 2 : 13). ఆదాము తన భార్య మాటలు విని ఆ వృక్ష ఫలములను తినెను (ఆది. కా. 3:12, 17). శరీరాశ నేత్రాశ జీవపుడంబాన్నే హవ్వ కోరుకొనెను (1 యోహాను 2:16).

వారు సమ్మతించకుండా ఈ కార్యాన్ని చేయలేదు (ఆమోసు 3:3). మేలైనది చేయనెరిగియు అలాగు చేయనివానికి పాపము కల్గును (యాకోబు 4 : 17).

మానవ కోరిక వలన మానవ దృష్టి యొక్క యిష్టము చొప్పున ప్రవర్తింపవచ్చు గాని తీర్పుండని గ్రహించాలి (ప్రసంగి 11:9). అన్నిటియందు స్వాతంత్ర్యము కలదు గాని అన్నియు చేయదగినవి కావు (1 కొరింథీ 10:23). ముఖ్యంగా ఆ స్వాతంత్ర్యము శరీర క్రియలకు హేతువు చేసికొనకూడదు (గలతీ 5 : 13). అయితే ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు (మత్తయి 6 : 24). విశ్వాసమూలము కాని దేదో అది పాపము (రోమా 14 : 23). వీరు దేవుని నిబంధనను మీరి విశ్వాస ఘాతకు లయ్యారు (హోషేయ 6:7). అందుచే పాపము మానవున్ని దేవున్నుండి వేరుచేసినది.

అవిధేయులతో దేవుడు మాట్లాడినప్పుడు ఆదాము తన దోషములను దాచిపెట్టుకొని (యోబు 31:33), ఒకరుమీద నొకరు నెపములు చెప్పసాగిరి (ఆది.కా. 3 : 9-19). అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు గాని వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరింపబడును (సామెతలు 28 : 13). వీరిద్వారా పాపమరణ నియమములు లోకంలో ప్రవేశించెను (రోమా 5 : 12; 8 : 12). హవ్వనుండి యే సర్వశరీరులు వచ్చినందున ఆమె జీవముగల ప్రతివానికి తల్లియైయున్నది. ఈమె దేవునికిని ఆదాము కుటుంబానికి అవిధేయురాలుగా నిలిచెను. మనము క్రీస్తులో ఫలింపనిచో, వనికిరాని తీగెలను ఆయన తీసి పారవేయును (యోహా 15:1-6). ఏదెనులో తింటే చస్తావు అన్నాడు. ఇప్పుడు మంచి ఫలములు ఫలింపనిచో నరకములో వేస్తారు (మత్తయి 7:19; 3:10). మోసపోవద్దు ఏమి విత్తుదువో ఆ పంటనే కోస్తావు (గలతీ 6:7).

—జి.పి. రత్నకుమారి, మద్రాసు-12.

— o —

## సంక్షిప్త వార్తలు

1993 అక్టోబరు నెలలో ఆంధ్రప్రదేశ్ లో పర్యటించిన రేటవున్ పెద్దలు Bro. J.B. ట్రోటర్ గారు డిశంబరు 2వ తేదీన బయలుదేరి తమ స్వదేశము క్షేమంగా చేరుకొన్నారు.

1993 నవంబరు 30వ తేదీన Bro. జాషువా గూటంగారు సతీ సమేతంగా ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా చేరుకొన్నారు. అక్కడ జరుగుచున్న 9th Asian Bible Lectureship లో ప్రసంగీకు నిగా ఆయన ఆహ్వానింపబడుటచే వెళ్లుట జరిగినది. ఆ మహాసభ డిశంబరు 1 నుండి 5 వరకు ఘనముగా జరిగినది. దానిలో పాల్గొనుటకు గాను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, థాయ్‌లాండ్, తైవాన్, మలేషియా సింగపూర్, ఇండియా, అమెరికా దేశాలనుండి క్రీస్తు సంఘ బోధకులు, సభ్యులు వచ్చిరి. జాషువాగారు రెండు పర్యాయములు ఆ సభలో ప్రసంగించిరి. అనేకులు జాషువాగారిని ప్రశంసించుటయే గాక, భారత దేశంలో జరుగుచున్న గొప్ప పునరుద్ధరణ ఉద్యమాన్ని గూర్చి విని ఆనందించిరి. డిశంబరు నెల 4వ తేదీనుండి జాషువాగారు, వారి సతీమణి కబితగారు మూడు రోజులపాటు సింగపూర్‌లో యుండిరి. డిశంబరు 5వ తేదీ ఆదివారం ఆరాధనలో సింగపూర్‌లో యున్న ఒక స్థానిక క్రీస్తు సంఘారాధనలో జాషువాగారు ఉపన్యసించిరి. ఆరోజు ఇద్దరు చైనీస్ యువతులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. దేవుని కృప వలన జాషువా దంపతులు క్షేమంగా డిశంబరు 9వ తేదీ ఉదయానికి తమ స్వగృహామునకు చేరుకొనిరి.

డిశంబరు 22వ తేదీనాడు నిడుబోలులో జరిగిన ఒక పెద్ద బహిరంగ సభకు జాషువాగారు ముఖ్య అతిధిగా వెళ్ళిరి. క్రైస్తవులు, క్రైస్తవేతరులు, పట్టణ ప్రముఖులు ఈ సభకు హాజరైయ్యారు. నిడుబోలు పట్టణములో Bro. A. మోహనరావ్ గారు క్రీస్తుకొరకు మంచి పని చేయుచున్నారు.

1993 డిశంబరు నుండి ఆర్థిక వనరుల కొరత వలన సత్యవాణి కార్యక్రమాలు మంగళ, గురు, శుక్రవారాల్లో మాత్రమే ప్రసారము చేయబడుచున్నవి. వీటిని రేడియోలో ప్రసారము చేయుటకు తగినంత ఆర్థిక వనరులు చేకూరులాగున ప్రార్థించ మనవి.

*  *  *

డిశంబరు నెల సువార్తికుల సదస్సు మరియు సువార్తకూటము 28వ తేదీన తూ॥గో॥ జిల్లా గొల్లపల్లిలో జరిగెను. క్రీస్తు సువార్త యొక్క శక్తినిగూర్చి ప్రకటించుచు శ్రమించుచున్న ప్రియ సువార్తికుల సమక్షంలో "సంపూర్ణమైన దేవుని చిత్తము లేఖనములనుండి తెలిసికొనగలమా లేక లేఖనములకు వేరుగా బయలు పరచబడుచున్నదా?" అను ప్రాముఖ్యమైన అంశము చర్చింపబడెను.

సకాలంలో ప్రారంభమైన ఉదయకాల సమావేశమునకు సోదరులు జి. మత్రిక్‌గారు అధ్యక్షులుగా నుండి సమయోచితంగా కార్యక్రమమును నడిపించిరి. సోదరులు R. స్టీవెన్‌సన్‌గారు, M. కిరణ్ కుమార్‌గారు, K. పట్టాభిగారు, P. సమూయేలుగారు, M. జోసఫ్ గారు, V. చిన్నయ్యగారు, N. ఏలీయాగారు మరియు B. యోహాను గారు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు M. కిరణ్‌కుమార్‌గారు అధ్యక్షత వహించిరి. సోదరులు వాసా ప్రసాదరావుగారు, P. ప్రకాశంగారు మరియు జామువాగూటంగారు పై అంశముపై గొప్ప సంగతులను దేవుని వాక్యపు వెలుగులో అందించిరి.

బైబిలైతే సంపూర్ణమై యున్న దేవుని చిత్తము లేఖనములలో యున్నదని (రోమా 12:2, యాకో. 1:25) అపొస్తలులు ప్రకటించిన సువార్త గాక ఎవరైనను, దేవుని దూతయైనను వేరొక సువార్త ప్రకటిస్తే వాడు శాపగ్రస్థుడని బైబిలు ప్రకటించుచున్నది. మానవులు లేఖనములను విడిచి వేరొక బోధకొరకు కనిపెట్టుచున్నారు. లేఖనములయందు నిత్య జీవము కలదని వీరు నమ్మరు. వీరు లేఖనముల అధికారమును శంకించువారు. దైవావేశము వలన లేఖనములు వ్రాయబడెను (2 తిమో 3:16-17). దీనికి ఎవరును ఏమియు కలుపకూడదు, తీసివేయకూడదు (ప్రక 22:18-19). యిది స్థిరపరచబడినది (మార్కు-

16 : 20) ధృఢపరచబడినది (హెబ్రీ 2:3-4). దేవుడే తన చిత్తమును నేడు మానవులకు నేరుగా బయలు పరచుచున్న యెడల బైబిలు యొక్క అవసరమేమి? సువార్తను మానవులు ప్రకటించవలెనని దేవుడు కోరుచున్నాడు (మార్కు 16 : 15-16; 2 తిమో 4:2).

మన జీవమునకు, భక్తికి కావలసినవన్నిటిని ఆయన తన గ్రంథ మందు పొందు పరచెను (2 పేతు 1:3). దేవుడు తన వాక్యము ద్వారా మనతో మాటలాడుచున్నాడు. "సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకో 1 : 18). ఆయన వాక్యమే సత్యము (యోహా 17:17). యేసు ప్రభువు పౌలునకు సువార్త ప్రకటించలేదు. ఆ పని అననీయకు అప్పగించెను (అ.కా. 9:10). ఐతియోపీయ నపుంసకునికి దేవదూతకాదుగాని ఫిలిప్పు సువార్త ప్రకటించెను. నేడు దేవుడు లేఖనములకు వేరుగా తన చిత్తమును ఎవరికీ బయలు పరచుటలేదు అని బోధించిరి.

సాయంకాల సువార్త కూటమునకు అనేకులు హాజరైరి. 6గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గొల్లవిల్లి పరిసర ప్రాంతములలో పాల్ గూటంగారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

---

Regd. No. H/KD—45/KD H.O

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To ..................................
..................................
..................................
..................................